
సాక్షి
ప్రకాశం
బుధవారం । 19 । జూన్ । 2024



తిరుమలనాథ స్వామికి బ్రహ్మోత్సవ శోభ

పెద్దారవీడు మండలంలోని గొ్డ్రాలికొండ తిరుమలనాథస్వామికి ఈనెల 20 నుంచి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. - 8లో..



వేడుకగా నారసింహుని వాహన సేవలు

పాతసింగరాయకొండలోని వరాహ లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. - 8లో..

గరిష్టం/కనిష్టం
39/31

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

పీఎం కిసాన్ నిధులు విడుదల

ఒంగోలు సెంట్రల్: ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేసే ముందు రైతులకు సాగు ఖర్చుల కోసం ప్రధాన మంత్రి కిసాన్ సన్మాన్ నిధి యోజన కింద మొదటి విడతలో ప్రతి రైతుకు కేంద్ర ప్రభుత్వం రూ.2 వేలు నగదును రైతు ఖాతాలను అందజేసినట్లు జేడీఏ శ్రీనివాస రావు తెలిపారు. జిల్లాలో 17వ విడత 2.42 లక్షల మందికి రూ.48.55 కోట్లు విడుదల చేసినట్లు చెప్పారు.

కంప్యూటర్, ట్యాలీ కోర్సుల్లో శిక్షణ, ఉద్యోగం

ఒంగోలు: నిరుద్యోగ యువతకు బెంగళూరులో కంప్యూటర్, ట్యాలీ కోర్సుల్లో శిక్షణ, ఉద్యోగాలను తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కల్పించనున్నట్లు ఉన్నతి ఫౌండేషన్ కోఆర్డినేటర్ హరిప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణత, ఇంటర్ పాస్/ఫెయిల్, డిప్లొమా పాస్/ఫెయిల్, డిగ్రీ పాస్/ఫెయిల్ కలిగి ఉండి 18 నుంచి 28 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్నవారు ఈ శిక్షణకు అర్హులు. 35 రోజులపాటు బెంగళూరులో ఇచ్చే శిక్షణ పూర్తి ఉచితమని, శిక్షణ కాలంలో ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పిస్తారన్నారు. ఈ 35 రోజుల కోర్సులో టాలీ+జీఎస్టీ, కంప్యూటర్ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లిష్, కమ్యూనికేషన్ స్కిల్స్, లైఫ్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్, వర్క్ ప్లేస్ ఎథిక్స్‌లో అత్యుత్తమ శిక్షణ ఉచితంగా ఇస్తారన్నారు. శిక్షణ అనంతరం 100 శాతం వివిధ సంస్థల్లో కనీస నెల జీతం రూ.15 వేలు పైన కల్పిస్తారన్నారు. పూర్తి వివరాలకు 90004 87423 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

కర్నాటక కాగ్ అడ్వయిజరీ బోర్డు మెంబరుగా శరణ్‌కుమార్



శరణ్‌కుమార్

మార్కాపురం: మార్కాపురం పట్టణంలో ప్రముఖ ఆడిటర్ తోట సత్యనారాయణ అల్లుడు మార్కాపురం వాసి శరణ్‌కుమార్ కర్నాటక రాష్ట్ర కంట్రోలర్ ఆడిటర్ జనరల్ అడ్వయిజరీ బోర్డు మెంబరుగా నియమితులయ్యారు. రెండు సంవత్సరాల పాటు ఆయన ఈ పదవిలో ఉంటారు. ఈమేరకు కేంద్ర ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ సందర్భంగా శరణ్‌కుమార్‌ను, తోట సత్యనారాయణను పలువురు అభినందించి సన్మానించారు. ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ పానుగంటి మురళి, ప్రముఖ సామాజిక ఉద్యమకారుడు నజీర్ అహ్మద్, వైఎస్సార్ సీపీ నేత గుంటక చెన్నారెడ్డి, ఎస్ఎస్ అగ్రికల్చర్, హార్టీకల్చర్, లా కళాశాల కరస్పాండెంట్ నాదెళ్ల చంద్రమౌళి, రిటైర్డు డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డేవిడ్ స్టోన్, సెవెన్‌హిల్స్ లాడ్జి అధినేత గుంటక చెన్నారెడ్డితో పాటు న్యాయవాది బత్తుల రామిరెడ్డి తదితరులు తోట సత్యనారాయణను, శరణ్‌కుమార్‌ను అభినందించి సన్మానించారు.

మంత్రి స్వామిని కలిసిన కలెక్టర్



తూర్పునాయుడుపాలెంలో మంత్రి స్వామికి పుష్పగుచ్ఛం అందిస్తున్న కలెక్టర్ దినేష్ కుమార్

టంగుటూరు: రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి, కొండపి ఎమ్మెల్యే డాక్టర్ డోలా బాల వీరాంజనేయ స్వామిని కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ టంగుటూరు మండలంలోని తూర్పు నాయుడుపాలెం మంత్రి నివాసంలో మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ పుష్పగుచ్ఛం అందించి, జిల్లాకు సంబంధించిన పలు అంశాలను మంత్రితో చర్చించారు.

ఐటీఐ విద్యార్థులకు జాబ్ మేళా

ఒంగోలు టౌన్: ఒంగోలులోని ప్రభుత్వ ఐటీఐ కాలేజీలో ఈనెల 20వ తేదీ క్యాంపస్ ఇంటర్వ్యూలు, జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కాలేజీ ప్రిన్సిపాల్ ఎంవీ నాగేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐ చదువుతున్న విద్యార్థులకు క్యాంపస్ ఇంటర్వ్యూ, ఐటీఐ పూర్తి చేసుకున్న విద్యార్థులకు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ మేళాలో అమరరాజా బ్యాటరీస్, హెటిరో డ్రగ్స్, శ్రీ సిటీ, ఆసియన్ పెయింట్స్, షిరిడీ సాయి ఎలక్ట్రానిక్స్, తోషిబా ఎలక్ట్రానిక్స్, జనతా ఆటో సొల్యూషన్స్, రామోజీ ఫిల్మ్ సిటీ, రిట్జ్ ఇండియా లిమిటెడ్, జెమ్ గ్రూప్స్ ఆఫ్ కంపెనీ, జ్యోతి గ్రానైట్స్, గుళ్లపల్లి గ్రోత్ సెంటర్‌లోని కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగాలు, అప్రెంటిస్‌లను ఎంపిక చేస్తుందని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం స్టయిఫండ్ ఇస్తారని, ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఒరిజనల్ సర్టిఫికెట్లతో పాటుగా జిరాక్స్ కాపీలను కూడా తీసుకొని హాజరుకావాలని సూచించారు. పూర్తి వివరాల కోసం 9703165456 ఫోన్ ద్వారా సంప్రదించాలని కోరారు.



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

ఉపాధికి తెలుగు తమ్ముళ్ల వెంపర్లాట!

అధికారంలోకి వచ్చింది ఆలస్యం... అక్రమంగా ఆదాయ వనరులు సమకూర్చుకోవడానికి టీడీపీ నాయకులు వెతుకులాట ప్రారంభించారు. ముందుగా మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ పథకంపై వారి కళ్లు పడ్డాయి. తెలుగు తమ్ముళ్లు ఆ శాఖ సిబ్బందిపై పెత్తనం చెలాయించి తాము పెద్ద మొత్తాల్లో 'ఉపాధి' పొందేందుకు సన్నాహాలు మొదలు పెట్టారు. ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టుకు రూ.లక్షల్లో బేరసారాలు జరుగుతున్నాయంటే ఆ శాఖ పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థమవుతుంది. సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ పూర్తయిన మరుసటి రోజు నుంచే జిల్లాలో ఉపాధి పనులు నిలిచిపోయాయి. పనులు ఎప్పుడు మొదలు పెడతారోనని కూలీలు ఎదురు చూస్తున్నారు.

- ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది కోసం బేరసారాలు
- లక్షల్లో పలుకుతున్న ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టులు
- అనుకూల స్థానాల కోసం వెతుకులాడుకుంటున్న ఏపీవోలు
- నిలిచిపోయిన ఉపాధి హామీ పథకం
- పనుల కోసం ఎదురు చూస్తున్న కూలీలు

యర్రగొండపాలెం:

ఉపాధి హామీ పథకం పనులతో జేబులు నింపుకునేందుకు అధికార పార్టీ నాయకులు వెంపర్లాడుతున్నారు. జిల్లాలో ఏపీవోలు 38 మంది, ఈసీలు 18 మంది, టీఏలు 170 మంది, ఎఫ్‌ఏలు 1073 మంది ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది ఉన్నారు. ఇప్పటి వరకు గ్రామీణ ప్రాంతాల్లో 4,43,252 మంది కూలీలు పనులకు వెళ్తున్నారు. వారికి రూ.202.87 కోట్ల వరకు కూలి అందింది. కొత్త ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఆ పార్టీకి చెందిన నాయకులు ఉపాధి సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. తమ అనుమతి లేకుండా పనులు ప్రారంభించవద్దని హుకుం జారీ చేశారు. చేసేదిలేక ఉపాధి పనులు ఎక్కడికక్కడ నిలిపేశారు. అప్పటి వరకు జరిగిన పనులకు కూడా కూలీ డబ్బులు వారి అకౌంట్‌లలో జమ చేయలేదు. గత మూడు వారాలుగా పనులు చేసిన కూలి డబ్బులు ఎప్పుడు జమ అవుతాయో, తిరిగి ఎప్పుడు పనులు ప్రారంభిస్తారో అన్న ఆలోచనతో ఉపాధి కూలీలు ఎదురు చూస్తున్నారు.



వై.పాలెంలోని ఎన్ఆర్ఈజీఎస్ కార్యాలయం

ఇదిలా ఉండగా ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది తమకు అనుకూల స్థానాల కోసం వెతుకులాట ప్రారంభించారు. ముఖ్యంగా ఏపీవోలు, ఈసీలు, టెక్నికల్ అసిస్టెంట్‌లు తమకు తెలిసిన నాయకులతో మంతనాలు సాగిస్తున్నారు. అందుకు ప్రతిఫలంగా ఎంతోకొంత చెల్లించేందుకు సిద్ధమవుతున్నారు. ఫీల్డ్ అసిస్టెంట్‌ల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ఎట్టి పరిస్థితుల్లో తమకు పనుల్లో ఉంచరని, కొత్తవారిని ఏర్పాటు చేసుకుంటారన్న ఆలోచనతో ఉన్నారు. టీడీపీకి చెందిన గ్రామ స్థాయి నాయకులు ఫీల్డ్ అసిస్టెంట్‌లుగా తమ వారిని ఏర్పాటు చేసుకోవటానికి సన్నాహాలు ప్రారంభించారు. అందుకు తమ వాటా కింద ఏమేరకు డబ్బులు ఇస్తారని వారితో బేరసారాలు కుదుర్చుకుంటున్నారు. పుల్లలచెరువు మండలంలో ఈ పోటీ ఎక్కువగా ఉందని తెలిసింది. ఒక్కొక్క పంచాయతీ పరిధిలో ఐదుగురు ప్రకారం ఫీల్డ్ అసిస్టెంట్‌లుగా చేరేందుకు తమ ప్రయత్నాలు చేస్తున్నారు. ఆయా పంచాయతీలలో ఉపాధి కూలీలను బట్టి లక్షల రూపాయలు కూడా ఇవ్వటానికి పోటీ పడుతున్నారు. ఇదిలా ఉండగా అధికార పార్టీకి చెందిన నాయకులు తమ స్థాయిని బట్టి పోస్టులను భర్తీ చేసుకోవటానికి సిద్ధమయ్యారు. అందుకు ప్రతి నెలా తమ అకౌంట్‌లలో ఒప్పందం చేసుకున్న మేరకు డబ్బులు జమ చేసేలా మాట్లాడుకుంటున్నట్లు తెలిసింది. రెండు మూడు రోజుల్లో ఈ తతంగం పూర్తి చేయటానికి నియోజకవర్గ స్థాయి నాయకులు సిద్ధమవుతున్నారు.

ఉపాధి పనులు చేపట్టాలి



గ్రామాల్లో ఉపాధి పనులు చేపట్టకపోవడం వలన ఇంటి దగ్గరే ఉండాల్సి వస్తోంది. చేస్తున్న పనులు ఎందుకు ఆపివేశారని అడిగితే ఉన్నతాధికారులు ఉపాధి పనులు నిలిపేయాలని ఆదేశించారని ఎఫ్ఏలు అంటున్నారు. గ్రామాల్లో పనులు దొరక్కపోవడంతో ప్రతిరోజు ఉపాధి పనులకు వెళ్లి రూ.230 తెచ్చుకుంటున్నాం. ఇప్పుడేమో పనులు ఆపమని చెప్పారు. మాకు జీవనోపాధి ఎలా జరుగుతుంది. గ్రామాల్లో పొలం పనులు ఆగస్టులో కాని మొదలు కావు, అప్పటి వరకు కూలీల జీవనం ఏ విధంగా సాగుతుంది.

– మరియదాసు, పుల్లలచెరువు.

వలసలు వెళ్లాల్సి వస్తుంది




గ్రామంలో ప్రస్తుతం ఉపాధి హామీ పథకం ద్వారా పనులు జరగడం లేదు. కొన్ని రోజుల క్రితం ఉపాధి పనులు అధికారులు నిర్వహించారు. ఇటీవల కాలంలో పనులు నిలిపేశారు. వర్షాలు కురవకపోవడంతో గ్రామాల్లో వ్యవసాయ కూలి పనులు దొరకడంలేదు. గత ప్రభుత్వంలో ఉపాధి హామీ పనులు కల్పించారు. కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాత అధికారులు పనులు నిలిపేశారు. పనులు చూపించకపోతే ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లాల్సిన పరిస్థితి ఉంటుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఉపాధి హామీ పనులు ప్రారంభించి జీవనోపాధి కల్పించాలి.

– కాసు వెంకటేశ్వరరెడ్డి, పెద్దారవీడు

డెడ్ స్టోరేజీకి రామతీర్థం



రామతీర్థం రిజర్వాయర్‌లో అడుగంటిన సాగర్ జలాలు



రామతీర్థం రిజర్వాయర్ అవుట్‌ఫ్లో నుంచి నిలిచిపోయిన సాగర్ జలాలు

- 74.9 మీటర్లకు చేరుకున్న రిజర్వాయర్ మట్టం
- సాగర్ నీళ్ల కోసం మరో రెండు నెలలు ఆగాల్సిందే
- చెరువులు, ఒంగోలు, చీమకుర్తి ఎస్ఎస్ ట్యాంక్‌లకు 80 శాతం వరకు నిల్వలు
- వరి నారుమడులకు కష్టమే

చీమకుర్తి: రామతీర్థం రిజర్వాయర్‌లో సాగర్ జలాలు పూర్తిగా అడుగంటాయి. దాని పూర్తి స్థాయి నీటి మట్టం 85.34 మీటర్లు కాగా ప్రస్తుతం 74.93 మీటర్లకు చేరుకుంది. ఇరిగేషన్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం... దాదాపు 70 వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణతో పాటు చీమకుర్తి, ఒంగోలు ప్రాంతవాసులకు తాగునీరు ఇచ్చేందుకు రూ.50 కోట్లతో రామతీర్థం రిజర్వాయర్‌ను నిర్మించి 2009లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రారంభించి జిల్లా ప్రజలకు అంకితం చేశారు. అప్పటి నుంచి రామతీర్థం రిజర్వాయర్ నుంచి సాగు, తాగునీటికి సాగర్ జలాలు అందిస్తున్నారు. రాష్ట్ర విభజన అనంతరం నుంచి సాగర్ జలాలు ఆశించిన రీతిలో రాష్ట్రానికి రాకపోతుండటంతో దాని ప్రభావం సాగు భూములపై పడుతోంది. జిల్లాలో ఖరీఫ్ సీజన్ ఆలస్యంగా ప్రారంభమవుతున్న సంగతి తెలిసిందే. దానిలో భాగంగా ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో వరి నాటే రైతులకు వరినారు మడులు పోసుకోవడానికి అవసరమైన సాగర్ జలాలను ప్రస్తుతం ఇచ్చే పరిస్థితి లేదు. రామతీర్థం రిజర్వాయర్ పూర్తిగా ఇప్పటికే అడుగంటిన నేపథ్యంలో సాగు ఎలా చేయాలా అని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కానీ జిల్లా ప్రజల దాహార్తిని తీర్చేందుకు మాత్రం 20 రోజులుగా రామతీర్థం రిజర్వాయర్ నుంచి నీరు అందించారు. ఒంగోలు ఎస్ఎస్ ట్యాంక్‌లు-1, 2 కి, చీమకుర్తి ఎస్ ఎస్ ట్యాంక్‌తో పాటు ఈతముక్కల, అల్లూరు టెయిల్ ఎండ్ ప్రాంతాల్లోని మేజర్ల ద్వారా ఆయా ప్రాంతాల్లోని నోటిఫైడ్, నాన్ నోటిఫైడ్ చెరువులన్నిటికీ తాగునీటిని ఇరిగేషన్ అధికారులు అందించారు.

ఒంగోలు ఎస్ఎస్ ట్యాంక్-1 సామర్థ్యం 1609 మిలియన్ లీటర్‌లు, ఎస్ఎస్ ట్యాంక్-2 సామర్థ్యం 3038 మిలియన్ లీటర్లు కాగా ఆ రెండు ఎస్ఎస్ ట్యాంక్‌లలో ఇప్పుడు 80 శాతానికి పైగా తాగునీటి నిల్వలు ఉన్నాయి. వాటితో పాటు చీమకుర్తి ఎస్ఎస్ ట్యాంక్, బొడ్డువారిపాలెం, సంతనూతలపాడు, నిప్పట్లపాడు, ఎంటీ.రాజుకాలనీ, శ్రీహరిపురం, సర్వేరెడ్డిపాలెం, మంగమూరు, అల్లూరు, ఏలూరివారిపాలెం, ముప్పవారిపాలెం, ఎనికపాడు, జీఎల్.పురం, గోనుగుంట, కేవీపాలెం, పులికొండ, ఎండ్లూరు, కామేపల్లివారిపాలెం, ఆలూరు, గాదెపాలెం, లింగంగుంట, నర్సాయపాలెం, బెజవాడవారిపాలెం, నేలటూరివారిపాలెం, పెదకొత్తపల్లి, మండువవారిపాలెం, దశరాజుపల్లి, గురవారెడ్డిపాలెం, రుద్రవరం, మారెళ్లగుంటపాలెం, మైనంపాడు, చంద్రపాలెం, గుమ్మళంపాడు, బూదవాడ, చంద్రపాడు, మర్లపాడు, శివపురం, వాసేపల్లిపాడు, టీ.నాయుడుపాలెం, కందులూరు, ఆలకూరపాడు ప్రాంతాల్లోని నోటిఫైడ్, నాన్ నోటిఫైడ్ చెరువులన్నిటికీ 80 శాతానికి పైగా తాగునీటిని ఇచ్చినట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు.

మళ్లీ ఆగస్టు నెలాఖరులోనే..

ప్రస్తుతం నాగార్జున సాగర్ డ్యామ్ నుంచి సాగర్ జలాలు ఇప్పట్లో వచ్చే పరిస్థితి లేదు. రామతీర్థం రిజర్వాయర్ పూర్తిగా డెడ్ స్టోరేజీకి చేరుకుంది. వరి నాట్లు వేసుకునే సమయానికి దాదాపు ఆగస్టు నెలాఖరులో మళ్లీ సాగర్ జలాలు వచ్చే అవకాశం ఉందని ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు. అప్పటి వరకు చెరువులన్నీ 80 శాతం నీటితో నిండి ఉన్నందున తాగునీటికి ఇబ్బంది లేకున్నా సాగునీటికి ప్రభుత్వం సకాలంలో స్పందించి నాగార్జున సాగర్‌డ్యాం నుంచి ఇప్పిస్తే తప్ప ఇప్పట్లో సాగర్ జలాలు సేద్యానికి వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీలో 12వ స్థానం

ఒంగోలు: ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ద్వితీయ సంవత్సర పరీక్ష ఫలితాల్లో జిల్లా 12వ స్థానంలో నిలిచింది. మంగళవారం ఫలితాలను ప్రభుత్వం విడుదల చేసింది. జనరల్ విభాగంలో 3015 మంది బాలురకుగాను 1825 మంది (61 శాతం), 2472 మంది బాలికలకు 1505 మంది (61 శాతం) ఉత్తీర్ణులయ్యారు. ఒకేషనల్ విభాగంలో 520 మంది బాలురకు 306 మంది(59 శాతం), 342 మంది బాలికలకు 228 మంది (67 శాతం) పాసయ్యారు. మొత్తంగా జనరల్ విభాగంలో 61 శాతంతో 12వ స్థానం, ఒకేషనల్ విభాగంలో 62 శాతంతో 8వ స్థానంలో ప్రకాశం జిల్లా నిలిచిందని ఆర్ఐవో ఎ.సైమన్ విక్టర్ తెలిపారు.

యాజమాన్యం వారీగా ఉత్తమ ఫలితాలు:

ప్రభుత్వ కాలేజీలు: 933 మంది పరీక్షలకు హాజరుకాగా 696 మంది (74.6శాతం) ఉత్తీర్ణులయ్యారు. అయితే అర్ధవీడు, టంగుటూరు జూనియర్ కాలేజీలు వంద శాతం ఉత్తీర్ణత సాధించాయి.

ఏపీ మోడల్ పాఠశాలలు: 154 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 89మంది (57.8 శాతం) ఉత్తీర్ణత సాధించాయి. దోర్నాల ఏపీ మోడల్ స్కూల్ అత్యధికంగా 96.8 శాతం, ఏపీ మోడల్ స్కూల్ దర్శి 64.52 శాతం ఉత్తీర్ణత సాధించాయి.

హైస్కూలు ప్లస్: 48 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 34మంది (70.8శాతం) ఉత్తీర్ణత సాధించారు. పాకల, హెచ్ నిడమానూరు, కొణిజేడు హైస్కూలు ప్లస్ వందశాతం ఉత్తీర్ణత సాధించినట్లయింది.

కేజీబీవీలు: కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల్లో 197 మంది పరీక్షలు రాయగా 153 మంది(77.66శాతం) ఉత్తీర్ణత సాధించారు. దీంతో పెద్దారవీడు, పుల్లలచెరువు, సీఎస్‌పురం, అర్ధవీడు, బేస్తవారిపేట, దొనకొండ, ముండ్లమూరు, పొన్నలూరు, రాచర్ల కస్తూర్బాగాంధీ బాలికా పాఠశాలలు వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లయింది.

ఏపీఎస్‌డబ్ల్యూఆర్/ఏపీటీడబ్ల్యూఆర్: ఏపీ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్/ ఏపీ గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ సంస్థల్లో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న 97 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 63 మంది(64.90శాతం) ఉత్తీర్ణత సాధించారు. దీంతో కంభం, కొండపి, చీమకుర్తి ఏపీ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ సంస్థలు వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు అయ్యాయి.

ఎయిడెడ్: 12 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 9 మంది (75 శాతం) ఉత్తీర్ణత సాధించారు.

ప్రైవేటు : 4046 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 2286 మంది (56.50) శాతం ఉత్తీర్ణత సాధించారని ఆర్ఐవో ఎ.సైమన్ విక్టర్ తెలిపారు.

స్టూడెంట్ ఎన్‌రోల్‌మెంట్ నూరు శాతం చేయాలి

- కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: నేను బడికి పోతా కార్యక్రమం ద్వారా జిల్లాలో స్టూడెంట్ ఎన్‌రోల్‌మెంట్ కార్యక్రమాన్ని నూరు శాతం పూర్తి చేయాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ప్రకాశం భవనంలో మాట్లాడుతూ ఈ నెల 13 నుంచి జులై 12వ తేదీ వరకు సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో జిల్లాలో నిర్వహిస్తున్న నేను బడికి పోతా స్టూడెంట్ ఎన్‌రోల్‌మెంట్ కార్యక్రమంపై సమీక్షించారు. స్టూడెంట్ ఎన్‌రోల్‌మెంట్ కార్యక్రమంలో విద్యాశాఖతో పాటు ఐసీడీఎస్, సాంఘిక సంక్షేమ, మైనార్టీ, డీఆర్‌డీఏ, మెప్మా, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్‌లు భాగస్వాములు కావాలన్నారు. నూరు శాతం ఎన్‌రోల్‌మెంట్ నిర్వహించాలన్నారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు సంబంధిత శాఖలు భాగస్వామ్యంతో ర్యాలీలు నిర్వహించాలన్నారు. డోర్ టు డోర్ క్యాంపెయిన్ నిర్వహించి బడి బయట ఉన్న పిల్లలను గుర్తించడం, వారిని పాఠశాలల్లో చేర్పించే కార్యక్రమం చేపట్టాలన్నారు. ముఖ్యంగా 10వ తరగతి ఉత్తీర్ణులైన బాలికలు నూరు శాతం కళాశాలల్లో చేరాలన్నారు. సమావేశంలో డీఈఓ సుభద్ర, జెడ్పీ సీఈఓ మాధురి, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ లక్ష్మానాయక్, బీసీ వెల్ఫేర్ అధికారి అంజనీదేవి, మెప్మా పీడీ రవికుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నాటక రంగ ముద్దుబిడ్డ నాగినేని

ఒంగోలు మెట్రో: నాటక రంగంలో అన్ని విభాగాల్లో స్ఫూర్తిదాయకమైన బాధ్యత నిర్వహించిన నాగినేని నరసింహారావు నాటక రంగ ముద్దుబిడ్డగా జిల్లా నాటక రంగ చరిత్రలో నిలిచిపోయారని పలువురు కవులు, సాహితీవేత్తలు పేర్కొన్నారు. నాగినేని మెమోరియల్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక సీవీఎస్ రీడింగ్ రూమ్ అండ్ క్లబ్ ఆవరణలో మంగళవారం సాయంత్రం దివంగత నాగినేని నరసింహారావు 16వ వర్ధంతి సభ నిర్వహించారు. సంస్థ అధ్యక్షుడు మిడసల మల్లికార్జునరావు ఆధ్వర్యంలో నిర్వహించిన సభకు అసోసియేషన్ కార్యదర్శి కనమాల రాఘవులు అధ్యక్షత వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన ప్రముఖ ఆగమ వేద పండితుడు పరాంకుశం కేశవాచార్యులు మాట్లాడుతూ తన ప్రతిభా పాటవాలతో నాటకరంగ బలోపేతానికి నాగినేని నరసింహారావు కృషి చేశారన్నారు. నాగభైరవ కళా పీఠం అధ్యక్షుడు డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ మాట్లాడుతూ 50 ఏళ్ల పాటు పౌరాణిక నాటక రంగానికి సుదీర్ఘ సేవలను అందించి తనలాంటి ఎందరో కళాకారులను నాగినేని తీర్చిదిద్దారని చెప్పారు. కార్యక్రమంలో శ్రీకృష్ణదేవరాయ సాహిత్య సాంస్కృతిక సేవా సమితి అధ్యక్షుడు కుర్రా ప్రసాద్ బాబు, సాహిత్య సంస్థల ప్రతినిధులు శాంతారావు, డాక్టర్ సంత వేలూరి కోటేశ్వరరావు, గుంటూరు సత్యనారాయణ, ఐనంపూడి నరసింహారావు, వేముల సాంబమూర్తి, కొప్పోలు వెంకటేశ్వర్లు, నున్నా ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



నాగినేని నరసింహారావుకు నివాళులర్పిస్తున్న నాటక రంగ ప్రముఖులు, కవులు, సాహిత్య వేత్తలు

పాత కక్షల నేపథ్యంలో దాడి

ఒంగోలు టౌన్: పాత కక్షల నేపథ్యంలో ఒక వ్యక్తి పై దాడి చేసి గాయపరిచిన సంఘటన ఒంగోలులో మంగళవారం జరిగింది. బాధితుడి కథనం ప్రకారం.. నగర శివారులోని మదర్ థెరెస్సా కాలనీకి చెందిన ఖాజా మొహిద్దిన్ ఉరఫ్ ఎర్రబాబుపై అదే కాలనీకి చెందిన కొందరు వ్యక్తులు మూకుమ్మడిగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. సోమవారం ఉదయం కొందరు వ్యక్తులు కాలనీలోని ఎర్రబాబు ఇంటి వద్ద ఉంచిన కారును ధ్వంసం చేశారు. ఆయన ఈ విషయంపై తాలూకా పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ సాయంత్రం మరికొంత మంది బయటి వ్యక్తులతో కలిసి వచ్చి ఎర్రబాబుపై దాడికి యత్నించారు. పోలీసులుకు ఫోన్ చేసి చెప్పడంతో వెంటనే వారు ఘటనా స్థలానికి చేరుకోవడంతో దాడికి యత్నించినవారు అక్కడ నుంచి తప్పుకున్నారు. దీంతో కాలనీలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. తిరిగి మంగళవారం పోలీసులను వెంట పిలుచుకొని వచ్చిన సదరు వ్యక్తులు ఎర్రబాబు ఇంట్లోకి ప్రవేశించి సామగ్రి ధ్వంసం చేశారు. అడ్డు వచ్చిన ఆయన భార్య, కూతుళ్లపై దాడి చేసి.. ఎర్రబాబు తల పగులగొట్టారు. ఇంత జరుగుతున్నా పోలీసులు అడ్డుకోకుండా చోద్యం చూశారని బాధితుడి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. సమాచారం అందుకున్న డీఎస్పీ కిషోర్ బాబు సిబ్బందితో కలిసి ఘటన స్థలానికి చేరుకుని బాధితులను జీజీహెచ్‌కు తరలించారు. తాలూకా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా ఈ ఘటనకు రాజకీయాలతో ఎలాంటి సంబంధం లేదని డీఎస్పీ కిశోర్ బాబు తెలిపారు. ఎన్నికల సమయంలో డబ్బు పంపిణీ విషయంలో వచ్చిన మనస్పర్థలతో దాడి జరిగినట్లు తెలిపారు. రాజకీయ పార్టీలు హింసను ప్రోత్సహించవద్దని హితవు పలికారు.



జీజీహెచ్‌లో గాయాలతో బాధితులు

క్లుప్తంగా

చంద్రబాబు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి

ఒంగోలు: కందుకూరు, అద్దంకి నియోజకవర్గాలను ప్రకాశం జిల్లాలో కలుపుతానని ప్రకటించిన ముఖ్యమంత్రి చంద్రబాబు వెంటనే చర్యలు తీసుకోవాలని 139 బీసీ కులాల జేఏసీ చైర్మన్ మిరియం శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కాలయాపన చేయకుండా వెంటనే ఒంగోలు జిల్లాలో కందుకూరు, అద్దంకి నియోజకవర్గాలను కలపాలని, అలాగే మార్కాపురాన్ని జిల్లా కేంద్రంగా ప్రకటించాలని కోరారు.

ఎక్సైజ్ శాఖలోకి సెబ్‌ను విలీనం చేయండి



మంత్రి స్వామికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సెబ్ సీఐ నరహరి

సింగరాయకొండ: ఎక్సైజ్ శాఖలోకి సెబ్‌ను విలీనం చేయాలని రాష్ట్ర సాంఘిక, సంక్షేమ, వికలాంగుల, సచివాలయాలు, వలంటీర్ల శాఖా మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామిని కలిసి సెబ్ సీఐ నరహరి ఆధ్వర్యంలో పలువురు కలిసి విజ్ఞప్తి చేశారు. టంగుటూరు మండలం నాయుడుపాలెంలోని మంత్రి స్వామి నివాసంలో మంగళవారం సీఐ నరహరి ఆధ్వర్యంలో సర్కిల్ పరిధిలోని సెబ్ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి స్వామికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. సీఐ నరహరి మాట్లాడుతూ ఎక్సైజ్, సెబ్ శాఖలు రెండింటిని కలపాలని, ప్రస్తుతం వేర్వేరు శాఖలుగా ఉండటం వల్ల సిబ్బంది కొరత కూడా సమస్యగా ఉందని తెలిపారు. దీనిపై మంత్రి స్వామి సానుకూలంగా స్పందించారన్నారు. సెబ్ ఎస్సై దయాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

రూ.3 లక్షల విలువైన మోటార్లు చోరీ



చోరీ జరిగిన ప్రదేశం

పీసీపల్లి: మండల పరిధిలోని బట్టుపల్లిలో రూ.3 లక్షల విలువైన మోటార్లు చోరీకి గురయ్యాయి. వివరాల్లోకి వెళితే..బట్టుపల్లిలో మూలె పుల్లారెడ్డి, కై పు నరసింహారెడ్డి, గునపాటి వెంకటేశ్వర్లు, గోన మాలకొండయ్యలు పాలేటిపల్లి ఒడ్డున మోటార్లు ఉన్నాయి. వాటిని సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు చోరీ చేశారు. వీటి విలువ సుమారు రూ. 3 లక్షలు ఉంటుందని బాధితులు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమేష్‌బాబు తెలిపారు.

విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించాలి



తూర్పునాయుడుపాలెం పాఠశాలను పరిశీలిస్తున్న డీఈఓ సుభద్ర

టంగుటూరు: విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా విద్యాశాఖాధికారి సుభద్ర ఆదేశించారు. మండలంలోని తూర్పునాయుడుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఈఓ పాఠశాల తరగతి గదులు, విద్యార్థుల పుస్తకాలను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. ప్రభుత్వం నాణ్యమైన పుస్తకాలు, ఇతర వస్తువులు అందిస్తుందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. తరగతి గదిలో విద్యార్థుల బోధనా సామర్థ్యాన్ని పరిక్షించారు. ఇరుకు గదులో విద్యార్థులను ఉంచడంపై ఉపాధ్యాయులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పాఠశాల ఆవరణలో నిర్మిస్తున్న నూతన భవనం వివరాలను అడిగి తెలుసుకున్నారు, మరుగుదొడ్ల ఏర్పాటులో ప్రభుత్వం విడుదల చేసిన నగదును మాత్రమే వినియోగించాలన్నారు. పాఠశాల ఆవరణలో ఉన్న ఇసుక, కంకరను తొలగించాలని, ప్రభుత్వ ఆదేశాల మేరకే నడుచుకోవాలన్నారు. ఉపాధ్యాయులు సుధారాణి పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

మార్కాపురం: మార్కాపురం పట్టణంలోని డ్రైవర్స్ కాలనీలో నివాసముంటున్న బత్తుల రవికుమార్ రెడ్డి ఈనెల 8వ తేదీ నుంచి కనిపించడం లేదని తండ్రి చెన్నారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్సై అబ్దుల్ రెహమాన్ తెలిపారు. తన కుమారుడి వయసు సుమారు 50 ఏళ్ల ఉంటుందని ఫిర్యాదులో పేర్కొన్నారు.

పెద్దారవీడు: భక్తుల కల్పతరువు, కామధేనువు, సంతాన వరప్రదుడు, లక్ష్మీప్రదుడు, కోరిన కోర్కెలు తీర్చే గొౌడ్రాలికొండ తిరుమలనాథస్వామి ఆధ్యాత్మిక క్షేత్రంగా విరాజిల్లుతోంది. మండల పరిధిలో రాజంపల్లి గ్రామ సమీపంలో వెలసిన 108 దివ్య తిరుపతిలలో ప్రసిద్ధిగాంచిన తిరుమలనాథస్వామి బ్రహ్మోత్సవాలు ఏటా జూన్‌లో అంగరంగ వైభవంగా నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా ఈ నెల 20 నుంచి 29వ తేదీ వరకు జరగనున్న ఉత్సవాలకు ఆలయాన్నీ సకల హంగులతో ముస్తాబు చేస్తున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చలువ పందిళ్లు, మంచినీటి సౌకర్యం, లైటింగ్ తదితర పనులు ఆలయ సిబ్బంది చేపడుతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా భారీ సంఖ్యలో తిరుమలనాథస్వామి ఉత్సవాలకు భక్తులు హాజరుకానున్నారు.



తిరుమల గిరి కొండ

తిరుమలనాథస్వామికి బ్రహ్మోత్సవ శోభ

- ఈ నెల 20 నుంచి 29 వరకు బ్రహ్మోత్సవాల నిర్వహణ
- భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు

స్థల పురాణం ..

శ్రీ గొౌడ్రాలికొండ తిరుమలనాథస్వామి దేవస్థానం సుప్రసిద్ధమైన వైష్ణవ క్షేత్రంగా వెలిసింది. ఆలయాన్ని పూర్వకాలంలో ముచికుందుల మహర్షి వారిచే ప్రతిష్టించారు. గిరి స్వయముద్భవం, సంతాన రహితులైన దంపతులైన దంపతులు నియమ, నిష్టలతో గిరి ప్రదక్షిణ చేస్తే సంతాన భాగ్యం పొందుతారని భక్తుల విశ్వాసం. ఆలయ నిర్వహణకు అనేక గ్రామాల్లో భక్తులు ఉచితంగా భూములను కూడా దానం చేసినట్లుగా పెద్దలు చెబుతున్నారు.

రోజు వారి ఉత్సవాలు..

20వ తేది గురువారం (తెల్లవారితే శుక్రవారం) ముత్యాల తలంబ్రాలతో కల్యాణం, 21వ తేదీ శుక్రవారం సింహ వాహనం, 22వ తేది శనివారం శేష వాహనం, 23వ తేదీ ఆదివారం హనుమంత వాహనం, 24వ సోమవారం గరుడ వాహనం, 25 మంగళవారం గజ వాహనం, 26వ తేదీ బుధవారం సాయంత్రం రథోత్సవం, 27వ తేదీ గురువారం అశ్వ వాహనం, 28వ తేదీ శుక్రవారం హంస వాహనం, 29వ తేది సాయంత్రం రాజంపల్లిలో స్వామి గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి ఈదుల చెన్నకేశవరెడ్డి తెలిపారు. 20వ తేదీ గురువారం రాత్రి ఆలయం వద్ద సంతానం కావాల్సిన దంపతులకు గరుడ ప్రసాదం పంపిణీ చేస్తారని పేర్కొన్నారు. 26వ తేదీ రథోత్సవం సందర్భంగా కోలాటం, ఎలక్ట్రికల్ ప్రభలు, డ్రామాలు నిర్వహిస్తారని కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయం ప్రాంగణంలో 23వ తేదీ నుంచి బ్రహ్మణసత్రం, 24వ తేదీ నుంచి రెడ్ల సత్రం , 25వ తేదీ నుంచి ఆర్యవైశ్య సత్రం, 26వ తేదిన శ్రీ కృష్ణదేవరాయ బలిజ, తెలగకాపు సత్రం, కాకతీయ కమ్మ సత్రం, యాదవ సత్రం, రజక సత్రం, విశ్వబ్రహ్మణ సత్రం, శాలివాహన సత్రం, నాయిబ్రహ్మణ సత్రం, వడ్డెరాజుల సత్రాల్లో అన్నదానం ఏర్పాటు చేస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.



గొౌడ్రాలికొండ తిరుమలనాథస్వామి ఆలయం

ఆలయానికి వెళ్లే దారి ఇదే ..

కర్నూలు, శ్రీశైలం, పెద్దదోర్నాల, త్రిపురాంతకం, వినుకొండ, నరసరావుపేట నుంచి వచ్చే భక్తులు కర్నూలు - గుంటూరు రహదారిపై ఉన్న కొండారెడ్డి కాలనీ ముఖద్వారం దగ్గర దిగి ఆలయం దగ్గరకు ఒక కిలోమీటర్ దూరం వెళ్లాలి. మార్కాపురం, ఒంగోలు, గిద్దలూరు, యర్రగొండపాలెం, మాచర్ల నుంచి వచ్చే భక్తులు హనుమాన్ జంక్షన్ కుంట దగ్గర దిగితే అక్కడ నుంచి ఆలయం వరకు ఆటోలు తిరుగుతుంటాయి.



అలంకరణలో తిరుమలనాథస్వామి మూలవిరాట్

వేడుకగా నరసింహుని వాహన సేవలు



చంద్రప్రభ వాహనంపై వరాహ లక్ష్మీ నరసింహస్వామి



సూర్యప్రభ వాహనంపై..



హంస వాహనంపై..

- చంద్ర ప్రభ, సూర్య ప్రభ, హంస వాహనాలపై దర్శనమిచ్చిన వరాహ లక్ష్మీనరసింహస్వామి
- బ్రహ్మోత్సవాలకు భారీ సంఖ్యలో హాజరైన భక్తులు

సింగరాయకొండ: పురాణ ప్రసిద్ధిగాంచిన పాతసింగరాయకొండలోని వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. సోమవారం రాత్రి చంద్రప్రభ వాహనంపై, మూడో రోజు మంగళవారం స్వామి వారు సూర్య ప్రభ, హంస వాహనాలపై భక్తులకు దర్శనమిచ్చారు. ముందుగా స్వామి వారి మూలవిరాట్‌కు ఆలయ ప్రధాన అర్చకులు, వేద పండితులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. బ్రహ్మోత్సవాలను తిలకించేందుకు ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ తెలిపారు. బుధవారం సాయంత్రం శ్రీకృష్ణ యాదవ్ యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో పొట్టేళ్ల పందెం ఏర్పాటు చేశామని, స్వామివారు శేష వాహనంపై భక్తులకు దర్శనమిస్తారని ఆలయ కార్యనిర్వహణాధికారి పి.కృష్ణవేణి పేర్కొన్నారు.

నిలకడగా పొగాకు ధర

- గరిష్టంగా రూ. 334, కనిష్ట ధర రూ.205
- ఆర్ఎం లక్ష్మణరావు వెల్లడి

ఒంగోలు సెంట్రల్: రీజియన్ పరధిలో పొగాకు ధరలు నిలకడగా సాగుతున్నాయి. కొనుగోళ్లు ముమ్మరంగా సాగుతున్నట్లు ఆర్ఎం లక్ష్మణరావు తెలిపారు. రీజియన్ పరిధిలో మంగళవారం 9508 బేళ్లు రాగా 8556 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేయగా 952 బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించినట్లు చెప్పారు. ఒంగోలు, కొండపి కేంద్రాల్లో మంగళవారం 4401 బేళ్లు రాగా 4096 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేసి 305 బేళ్లను వివిధకారణాలతో తిరస్కరించారు. అందులో కేజీ గరిష్టంఘా రూ.334, కనిష్టంగా రూ.205, సరాసరి రూ.281.20 వచ్చినట్లు తెలిపారు. డీసీపల్లి, కలిగిరి, కందుకూరు-2, ఒంగోలు-2, వెల్లంపల్లి, పొదిలి, కనిగిరి తదితర కేంద్రాల్లో 5107 బేళ్లు రాగా4460 బేళ్లను కొనుగోలు చేసి 467 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.332, కనిష్ట ధర రూ.204, సరాసరి రూ.264.22 వచ్చినట్లు పేర్కొన్నారు.

కొండపి(సింగరాయకొండ): స్థానిక పొగాకు వేలం కేంద్రంలో మంగళవారం నిర్వహించిన వేలంలో అత్యధిక ధర రూ.331 పలికిందని వేలం నిర్వహణాధికారి జి.సునీల్‌కుమార్ తెలిపారు. చిన్నవెంకన్నపాలెం, వెన్నూరు గ్రామాలకు చెందిన రైతులు 1019 బేళ్లను వేలానికి తీసుకురాగా వ్యాపారులు 989 బేళ్లను కొనుగోలు చేసి వివిధ కారణాలతో 30 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.331, కనిష్ట ధర రూ.205, సరాసరి రూ.286.80 పలికింది. వేలంలో 30 మంది వ్యాపారులు పాల్గొన్నారు. మంగళవారంతో ఆరో రౌండ్ వేలం ముగిసిందని వేలం నిర్వణాధికారి జి.సునీల్‌కుమార్ తెలిపారు.



వేలం నిర్వణాధికారి సునీల్‌కుమార్

నేటి నుంచి ఏడో రౌండ్ వేలం

కొండపి బోర్డ్ పరిధిలో బుధవారం నుంచి ఏడో రౌండ్ వేలం నిర్వహించనున్నట్లు వేలం నిర్వణాధికారి జి.సునీల్‌కుమార్ తెలిపారు. రైతులు మిగిలిన కోటా కేజీలు ఉన్నంత వరకు బేళ్లు చెక్ చేసుకొని తెచ్చుకోవాలని సూచింఅరు. బేళ్లు 150 కేజీలకు మించకుండా చెక్ చేసుకొని తీసుకురావాలని కోరారు.

నేల బాగుంటేనే పంట నాణ్యత

- రైతులతో ముఖాముఖిలో శాస్త్రవేత్తలు

దర్శి: నేల బాగుంటేనే పంట ఉత్పత్తులు నాణ్యంగా ఉంటాయని కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ పి.సంధ్యా రాణి పేర్కొన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్న సందర్భంగా మంగళవారం స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో రైతులతో శాస్త్రవేత్తలు ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పి.సంధ్యారాణి మాట్లాడుతూ.. ప్రతి రైతు భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని సూచించారు. సేంద్రియ ఎరువుల వినియోగంతో కలిగే ప్రయోజనాలను, ప్రస్తుతం పాటించాల్సిన మేలైన యాజమాన్య పద్ధతులను వివరించారు. డాక్టర్ టి.వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ.. కంది పంటలో నూతన వంగడాలు, సస్యరక్షణ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. డాక్టర్ ఎస్.లీలా కృష్ణ మాట్లాడుతూ.. వానాకాలంలో పశువులకు సంక్రమించే వ్యాధులు, వాటి నివారణ చర్యలు, పాడి పరిశ్రమ ఆవశ్యకత, పాలసేకరణ, డెయిరీ యాజమాన్యంపై రైతులకు సూచనలు, సలహాలు అందజేశారు. డాక్టర్ ఎం.శివ మాట్లాడుతూ.. ఉద్యాన పంటల సాగులో పాటించాల్సిన మెళకువలు, మిరప సాగులో విత్తనాల ఎంపిక, పురుగులు, తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రత్యామ్నాయ పంటలైన సుగంధపాలు, అంజూర, సర్పగంధ, పంటల గురించి వివరించారు. అనంతరం కిసాన్ సఖి పథకం ప్రారంభోత్సవాన్ని వర్చువల్ విధానంలో రైతులకు చూపించారు. కార్యక్రమంలో కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ పి.సంధ్యారాణి

మద్యం మత్తులో యువకుడు మృతి

గిద్దలూరు రూరల్: మద్యం మత్తులో గొంతు ఎండి ఓ యువకుడు మృతి చెందిన సంఘటన గిద్దలూరులో మంగళవారం చోటుచేసుకుంది. వివరాలు.. పట్టణానికి చెందిన బొగ్గరపు చంద్రశేఖర్(28) అనారోగ్యానికి గురై తరచూ మద్యం సేవిస్తున్నాడు. గత కొంత కాలంగా మతిస్థిమితం లేకుండా తిరుగుతున్నాడు. గత మూడు రోజుల నుంచి మద్యం అధికంగా సేవిస్తున్నాడు. ఈ క్రమంలో వివేకానంద కళాశాల వెనక భాగాన ఖాళీ ప్రదేశంలో పడి ఉన్నాడని స్థానికులు చెప్పడంతో వెళ్లి చూసూసరికి అప్పటికే మృతి చెందాడని మృతుడి తండ్రి తెలిపాడు. గొంతు ఎండిపోయి మరణించి ఉంటాడని కుటుంబ సభ్యులతోపాటు పోలీసులు భావిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గిద్దలూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రక్తదానం ప్రతి ఒక్కరి బాధ్యత

- కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ రవీంద్రనాథ్



శిబిరంలో రక్తందానం చేస్తున్న కార్మిక నాయకులు

ఒంగోలు టౌన్: రక్తదానం చేయడం సమాజంలోని పౌరులందరి నైతిక బాధ్యత అని కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ ఆర్ రవీంద్రనాథ్ అన్నారు. సీఐటీయూ, ఏపీ ఎంఎస్ఆర్‌యుల ఆధ్వర్యంలో నగరంలోని రెడ్‌క్రాస్ భవనంలో మంగళవారం ఏర్పాటు చేసిన రక్తదానం శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్మికులు, ఉద్యోగుల హక్కుల కోసం పోరాడే సీఐటీయూ ప్రజల కోసం రక్తదానం చేయడం అభినందించదగ్గ విషయమని కొనియాడారు. ప్రపంచంలో అనేక మంది సరైన పోషకాహారం లేక రక్తహీనతతో బాధపడుతున్నారని , అలాంటి వారి పట్ల ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ ఉదయిని సూచించారు. సకాలంలో రక్తం అందక మరణించేవారి సంఖ్య గణనీయంగా పెరిగిందని, అలాంటి దుస్థితి రాకుండా ప్రతి ఒక్కరు రక్త దానం చేయాలని డాక్టర్ వంశీకృష్ణ కోరారు. ఇలాంటి సేవా కార్యక్రమాలను తరుచూ నిర్వహించడం వల్ల బాధితులకు రక్తం అందుబాటులో ఉండే పరిస్థితి ఉంటుందన్నారు. కార్యక్రమంలో పి.కల్పన, ఉబ్బ ఆదిలక్ష్మి, కేవీ సుబ్బమ్మ, కాలం సుబ్బారావు, జీవీ కొండారెడ్డి, దామా శ్రీనివాసరావు, మంగళగిరి నరసింహారావు, చిరంజీవి, ఉదయ్ కిరణ్, తంబి శ్రీనివాసరావు, కృష్ణ మోహన్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా

వైఎస్సార్ సీపీ గిద్దలూరు ఇన్‌చార్జి కె.పి.నాగార్జునరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కేపీ నాగార్జునరెడ్డి

గిద్దలూరు రూరల్: వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు అండగా ఉంటానని ఆ పార్టీ గిద్దలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి కె.పి.నాగార్జునరెడ్డి భరోసా ఇచ్చారు. పట్టణంలోని తన నివాస గృహంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముందుగా గిద్దలూరు ఎమ్మెల్యేగా గెలుపొందిన ముత్తుముల అశోక్‌రెడ్డికి అభినందనలు తెలియజేశారు. గిద్దలూరు నియోజకవర్గంలో మంచి వాతావరణంలో రాజకీయాలు కొనసాగేవని, ఇటీవల కొందరు టీడీపీ నాయకులు వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై దాడులకు పాల్పడటం చాలా బాధాకమరమైన విషయమన్నారు. ప్రజలు అధికారం కట్టబెట్టింది మంచి పరిపాలన అందించాలనే తప్ప అధికార దుర్వినియోగానికి పాల్పడకూడదన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడితే తమ మద్దతు కూడా ఉంటుందని స్పష్టం చేశారు. ఎటువంటి అల్లర్లు ఘర్షణలు లేకుండా అందరినీ కలుపుకొని పాలన కొనసాగించాలని కోరారు. ప్రజల పక్షాన ఉండి ప్రతి సమస్యపై పోరాడతామన్నారు. సమావేశంలో మాజీ ఎంపీపీ కడప వంశీధర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు కావేటి ఈశ్వర్‌నాయుడు, ఓబులరావుయాదవ్, ముద్దర్ల శ్రీను, పాలుగుళ్ల నరసింహారెడ్డి, కౌన్సిలర్లు పెద్దవలి, మానం బాలిరెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు షేక్ మస్తాన్‌వలి తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఉపాధ్యాయులకు శిక్షణ

ఒంగోలు: జిల్లాలో ఎంపిక చేసిన 20 పాఠశాలల్లో ఈ నెల 20 నుంచి 22 వరకు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు కెరీర్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాంపై శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి డి.సుభద్ర మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 20న ప్రధానోపాధ్యాయులకు, 10, 12 తరగతులకు బోధించే ఉపాధ్యాయులకు, 21న 9,11 తరగతులు బోధించే ఉపాధ్యాయులకు, 22న 8వ తరగతి బోధించే ఉపాధ్యాయులకు శిక్షణ ఉంటుందన్నారు. ఎంపిక చేసిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు వారికి సూచించిన తేదీల్లో తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. రాష్ట్ర సమగ్రశిక్ష, యూనివర్శిటీ ఆఫ్ మెల్‌బోర్న్ వారిచే శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. శిక్షణకు ప్రతి ఒక్కరూ ల్యాప్‌టాప్ లేదా ట్యాబ్‌తో తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు. విజయవాడలో శిక్షణ పొందిన రిసోర్సు గ్రూపు ఉపాధ్యాయులు కూడా హాజరుకావాలన్నారు. ప్రతి రోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ ఉంటుందన్నారు. సంబంధిత ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను ఉప విద్యాశాఖ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులు తప్పనిసరిగా రిలీవ్ చేయాలని డీఈఓ డి.సుభద్ర ఆదేశించారు.

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.